క్లుప్తంగా

పాన్‌గల్ గ్రంథాలయం తనిఖీ



పాన్‌గల్: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సోమవారం గ్రంథాలయ సంస్థల ఇన్‌చార్జ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య సందర్శించి రికార్డులు, పాఠకులు, అందుబాటులో ఉన్న పుస్తకాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవనం పరిస్థితి బాగానే ఉందా, పాఠకులకు అవసరమైన ఫర్నీచర్ ఉన్నాయా అనే విషయాలను లైబ్రేరియన్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లైబ్రేరియన్లు శ్రీను, తేజ, ఎగ్బాల్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి, చీకరుచెట్టుతండా, వీరాయపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను సోమవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాసంగి చివరి వరకు సాగునీరు కాల్వల ద్వారా అందిస్తామని, రైతులు అధైర్యపడొద్దన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తిక్కన్న, సిద్ధయ్య, రాధాకృష్ణనాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పాన్‌గల్: మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్ సమీపంలో కారు అదుపుతప్పి పంట పొలాలకు దూసుకెళ్లిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన వంశీ, యువరాజ్, అనిల్, కురుమూర్తి కారులో వనపర్తికి వెళ్తున్న క్రమంలో కేఎస్‌ఆర్ గార్డెన్ సమీపంలో చెట్టును, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో పంట పొలాలకు దూసుకెళ్లిన కారు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె వద్ద నిలిచిపోయింది. కారు బెలూన్స్ తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్న అనిల్, కురుమూర్తికి స్వల్ప గాయాలైయ్యాయి. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పాన్‌గల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని దావాజిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మహాశివరాత్రి విశిష్టతను తెలియజేశారు. శివలింగం పైన ఉన్న 'మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తు' అని ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, ఆజనేయులు, బద్రీనాథ్, పద్మ, స్వరూప, అలివేలమ్మ, స్నేహ, శశిలు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

కొత్తకోట రూరల్: నంద్యాల పట్టణ కేంద్రానికి చెందిన గోపాల్ అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం సోమవారం ఉదయం నంద్యాల నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. కారు కొత్తకోట మండలంలోని అమడబాకుల సమీపంలోకి రాగానే గోపాల్‌కు శ్వాస తీసుకోవడం ఇబ్బంది మారింది. దీంతో కారులో ఉన్న అతడి బంధువులు 108కు ఫోన్ చేయడంతో వెంటనే స్పందించిన 108 సిబ్బందికి గోపాల్‌కు ఆక్సిజన్ అందించి అక్కడి నుంచి నేరుగా వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించామని, ప్రస్తుతం గోపాల్ పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

ప్రమాదకర ప్రయాణం



అంకూర్ వద్ద ప్రధాన రహదారిపై రక్షణ గోడలేని కల్వర్టు

- రక్షణ గోడలు లేని కల్వర్టులు
- మలుపుల్లో సూచిక బోర్డులు కరువు

వనపర్తి రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదాలపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు భయాందోళన మధ్య ప్రయాణం సాగిస్తున్నారు. వనపర్తి నుంచి ఘనపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై అంకూర్ వద్ద నిర్మించిన కల్వర్టు, వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే ప్రధాన రహదారి రాజనగరం వద్ద రోడ్డుపై ఉన్న కల్వర్టుకు, జిల్లా కేంద్రం నుంచి పెబ్బేరు వెళ్లే రహదారిపై తిర్మలయ్యగుట్ట వద్ద కల్వర్టుకు రక్షణ గోడలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని కల్వర్టులు శిథిలావస్థకు చేరుకొని చువ్వలు తేలడంతో పాటు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా ఉండంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులేవి?

అప్పాయిపల్లి, కాశీంనగర్, అంజనగిరి, కడుకుంట్లతో పాటు వివిధ గ్రామాల ప్రధాన రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. రాత్రివేళల్లో మలుపులను అంచనా వేయకుండా వాహనాలు రోడ్డు కిందకు దూసుకుపోవడంతో పలువురు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలమైన కల్వర్టులను మరమ్మతు చేయించడంతో పాటు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గాయాలపాలు..

జిల్లా కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే మార్గంలో మలుపులు వద్ద సూచిక బోర్డులు, కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు వాహనదారులు తీవ్రంగా గాయపడిన ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి.

– కొండన్న గౌడ్, కడుకుంట్ల

రాత్రి వేళల్లో..

ప్రధాన రహదారులపై కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కల్వర్టుల వద్ద చువ్వలు తేలడంతో వాహనాలకు గుచ్చుకునే ప్రమాదం ఉంది.

– రమేష్, అంకూర్



రాజనగరం వద్ద..



అప్పాయిపల్లి వెళ్లే రహదారి..

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

వనపర్తి: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మార్చి 5 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 12,150 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,457 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసేవారు 5,693 మంది ఉండగా.. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

6.887 మంది విద్యార్థులు

మార్చి 21 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటాయి. జిల్లాలో మొత్తం 6,887 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నారు. వీరిలో 6,853 మంది రెగ్యులలర్ విద్యార్థులు కాగా.. 34 మంది కంపార్ట్‌మెంట్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఐఈఓ ఎర్రఅంజయ్య, డీఎస్పీ కె.ఉమామహేశ్వర్‌రావు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్‌కు సన్మానం

జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. 16 డిసెంబర్ 2023 నుంచి అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సంచిత్ గంగ్వార్ ఈ నెల 21న అదనపు కలెక్టర్‌గా నారాయణపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో సంచిత్ గంగ్వార్‌కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు, స్థానిక సంస్థల నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారని కొనియాడా. రెవెన్యూ, జిల్లా అధికారులు, మండల అధికారుల తరఫున సంచిత్‌కు శాలువాలు, పూల మొక్కలతో సన్మానించారు. సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ పోస్టింగ్ తీసుకున్నాక మొదటగా వనపర్తి జిల్లాలో విధులు నిర్వర్తించానని, చాలా విషయాలు నేర్చుకున్నానన్నారు. అధికారులు అందరూ చక్కటి ప్రోత్సాహం అందించారని కృతజ్ఞతలు తెలిపారు.



సంచిత్ గంగ్వార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

జలశక్తి పథకంలో చెక్‌డ్యాంల నిర్మాణం

ఖిల్లాఘనపురం: కేంద్రం ప్రభుత్వం చేపట్టిన జలశక్తి పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టినట్లు ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. మండలంలోని కర్నెతండా పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర జలశక్తి పథకంలో భాగంగా ఈ సంవత్సరం చెక్‌డ్యాంలు, గల్లీకంట్రోల్ తదితర పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కర్నెతండాలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం కు రూ.4.99 లక్షలు, రూ.10 లక్షలు ఖర్చు చేసి వాగులు, పాటు కాల్వల్లో చెక్‌డ్యాంల నిర్మిస్తామన్నారు. వందిరిగట్టు ప్రాంతంలో పారే వాగుకు చెక్‌డ్యాం కట్టడం వల్ల సుమారు 60 నుంచి 70 మంది రైతులకు ఉపయోగం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏ శ్రీనివాసులు ఉపాధికూలీలు పాల్గొన్నారు.



కర్నెతండాలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

956 మందికి మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో కొనసాగుతున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటిన వారందరూ పరీక్షలు చేయించుకొని, వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 956 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కేతేపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ కౌన్సిలర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. డబ్బు ఏ విధంగా పొదుపు చేయాలని, సైబర్ నేరాలను ఏ విధంగా ఎదుర్కొవాలి, ఇన్సూరెన్స్ వలన కలిగే లాభాలు తదితర అంశాలను వివరించారు. ఆయా అంశాలు విద్యార్థులు క్షుణ్ణంగా అర్థం చేసుకొని, గ్రామాల్లో ప్రజలకు అవగాహన పెంచుతూ వారిని చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ కౌన్సిలర్ విజయ్‌కుమార్

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

వనపర్తి విద్యావిభాగం: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు గురురాజుయాదవ్ అన్నారు. కొమ్ము చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మొక్కలతో మనిషి మనుగడ ముడిపడి ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమ్ము చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొమ్ము వెంకటేష్, ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు నిరంజన్, పీడీ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నరేష్, గగనం శీనయ్య తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, తదితరులు

'అక్రమార్కులకు అండగా అధికారులు'

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో అక్రమార్కులకు అధికారులు ప్రోత్సహిస్తు అండగా నిలుస్తున్నారని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు ఆరోపించారు. సోమవారం స్థానిక పుర కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణంలోని బాబా కాలనీలో టీఎన్జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీపీ తన రాజకీయ పలుకుబడితో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి యథేచ్ఛగా షాపుల నిర్మాణం చేపడుతున్నారని, నిర్మాణాలను నిలిపివేస్తామని హామీనిచ్చిన కమిషనర్ పనులు జరుగుతున్నా పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. మున్సిపాలిటీలో గతంలో ఏర్పాటు చేసిన వెంచర్లలో ఇచ్చిన 10 శాతం ప్లాట్లు సైతం అసెస్‌మెంట్ తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల చెర నుంచి స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, మోష, అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణశెట్టి, కుమార్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పుర కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

'దిగజారుడు రాజకీయాలు చేయొద్దు'

వనపర్తి: ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వర్గీయులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలో గోపాల్‌పేట మాజీ ఎంపీపీ ప్రభావతి, పట్టణ అధ్యక్షుడు చీర్ల రవీందర్ మాట్లాడుతూ 'నెత్తిన రూపాయి పెడితే ఆటనకు చెల్లం అంటున్నారు.. మీకోసం మా ఆస్తులు అమ్ముకున్నాం' మీ వెంట తిరిగితే మాకు ఏమైనా మిగిలిందా మీరేమో వందల ఎకరాలు వెనకేసుకున్నారని ఆరోపించారు. పక్కల ఉండే కార్యకర్తలను ఎదగకుండా బానిసలుగా చూసే మీరు సత్యశీలారెడ్డి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తారా అని మండిపడ్డారు. వనపర్తిలో చిన్నారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్ రెడ్డి తప్ప ఇతరులు రాజకీయాలు చేస్తే ఓర్వలేరని ఆరోపించారు. అనంతరం చీర్ల రవీందర్ మాట్లాడుతూ క్రమశిక్షణ కమిటీ చైర్మనే క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకల మహేష్, లక్కాకుల సతీష్, సాయిచరణ్‌రెడ్డి, శర్వానంద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ ప్రభావతి

కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: పంచాయతీ కార్యదర్శిని దూషించిన ఘటనలో ఒకరిపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన భూతగళ్ల నాగయ్య శివాలయం వద్ద ఇంటి నిర్మాణం చేపట్టే క్రమంలో గుడికి సంబంధించిన 7.5 పీట్ల స్థలాన్ని ఆక్రమించాడు. అతడు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ అనుమతి తీసుకోలేదని జీపీకి ఫిర్యాదు రావడంతో.. పంచాయతీ కార్యదర్శి పరశురాముడు నోటీస్ ఇచ్చేందుకు వెళ్లగా నాగయ్య దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూతగళ్ల నాగయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై..

దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఇద్దరిపై సోమవారం కేసు నమోదైందని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారంతండాకు చెందిన శంకర్‌నాయక్ ఇదే తండాకు చెందిన ముడావత్ బాలు వద్ద అప్పుగా రూ.50 వేలు తీసుకొని అసలు, మిత్తి కలిపి అతడికి చెల్లించాడు. ఇంకా అదనంగా రూ.10 వేలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 23న ముడావత్ బాలు, అతడి భార్య బొజ్జి అప్పు తీసుకున్న శంకర్‌నాయక్‌పై కట్టెతో దాడి చేసి గాయపర్చారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శంకర్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అనంతరం ఎక్కడ పడితే అక్కడ డబ్బులు అడుగుతారా అని శంకర్‌నాయక్, అతడి తల్లి చిల్క, రాత్లావత్ భాస్కర్ పరుశపదజాలంలో తిడుతూ కట్టెతో దాడిచేసి గాయపర్చారని బాలునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష్యానికి అనుగుణంగా సాధన చేయాలి

పాన్‌గల్: విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా నిరంతరం సాధన చేస్తే తప్పక విజయం లభిస్తుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్యం చేరే వరకు చదువును మధ్యలో ఆపొద్దని సూచించారు. బాలికలు బాలురతో సమానంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. బాలికల విద్యకు ప్రభుత్వం ప్రధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం అందించే వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, హైమావతి, ఎస్‌ఓ హేమలత, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

'ప్రతి తండాలో బీజేపీ జెండా ఎగరాలి'

వనపర్తిటౌన్/ఖిల్లాఘనపురం: జిల్లాలోని ప్రతి గిరిజన తండాలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ఎస్టీ మోర్చా నాయకులు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కేతావత్ రవినాయక్ తెలిపారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎస్టీ మోర్చా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పెద్దమండడి మండలానికి చెందిన రాజు, ఖిల్లాఘనపురం మండలానికి చెందిన సీత్యానాయక్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు, పార్టీ బలోపేతానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, పెద్దమందడి మండల అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న రవినాయక్

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



వీపనగండ్ల: హైదరాబాద్‌లో నిర్వహించిన మాస్టర్స్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన నలుగురు వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు సంపాదించారు. పల్ల రఘునాథ్‌రెడ్డి 10 కే, 1500 మీటర్లు, 200 మీటర్ల రన్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి మూడు గోల్డ్ మెడల్స్‌ను గెలుపొందగా, సాంస్కృతిక కళాకారుడు డి కృష్ణయ్య శాట్‌ఫట్ విభాగంలో రెండో బహుమతి, 5 కిలోమీటర్ల పరుగు పందెంలో సూర్యనారాయణ, 800 మీటర్ల పరుగు పందెంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న విష్ణు రెండో బహుమతి గెలుచుకున్నారు. దీంతో ఒకే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అథ్లెటిక్ పోటీలో పాల్గొని బహుమతులు సాధించడంపై గ్రామస్తులు వారిని అభినందించారు.

సాగునీరు విడుదల చేయాలి



కొత్తకోట రూరల్: మండలంలోని భీమా ఫేజ్–2 కింద ఉన్న మెట్ట వరి పొలాలను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఏనుగుంట రిజర్వాయర్, కొత్తకోట శంకరసముద్రం రిజర్వాయర్లలో నీటి స్టోరేజ్ లేకపోవడంతో ఎమ్మెల్యే సూచనతో నీటిపారుదల చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సాగునీరు విడుదల చేయాలని కోరామన్నారు. రైతులందరూ సమన్వయంతో నీటిని వినియోగించుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు. కర్ణాటక నుంచి జూరాలకు నీరు చేరిన వెంటనే ఆయా రిజర్వాయర్లను నింపుతామని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు శేఖర్‌రెడ్డి, కిరణ్, ఆంజనేయులు, రాంరెడ్డి, నాగరాజ్, సుదర్శన్‌రెడ్డి, శేషన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం తరలిన శివ మాలధారులు

అమరచింత: పట్టణానికి చెందిన శివ మాలధారులు సోమవారం ఇరుముడులు ధరించి శ్రీశైలానికి బయలుదేరారు. స్థానిక భక్తమార్కండేయ ఆలయంలో గురుస్వామి విష్ణు ఆధ్వర్యంలో ఇరుముడి పూజలు చేసి శివలింగాన్ని అభిషేకించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం మాలధారులు పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి శ్రీశైలం తరలివెళ్లారు.

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామానికి చెందిన శివ మాలధారులు సోమవారం గ్రామంలో ఇరుముడి పూజలు నిర్వహించి శ్రీశైలానికి బయలుదేరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, భక్తులు పాల్గొన్నారు.